

వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎర్రబెల్లి, బండా, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

## పట్టభద్రుల ఆత్మగౌరవం పెంచేలా పనిచేస్తా

ఈ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే పట్టభద్రుల ఆత్మగౌరవం పెంచేలా పని చేస్తా. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపిస్తే ఓరుగల్లు యువత, విద్యావంతులు గెలిచినట్టే. బూతులు మాట్లాడే, బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడి అడ్డదారిన కోట్లు సంపాదించుకునే వ్యక్తులను పెద్దల సభకు పంపించవద్దు. ఇప్పటి వరకు మేధావి వర్గం మాత్రమే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దల సభకు వెళ్లారు. ఆ పరంపరను మళ్లీ కొనసాగించి బీఆర్ఎస్ మరోసారి విజయం సాధించే దిశగా సంపూర్ణ సహకారం అందించాలి. నేను గెలిచాక వచ్చే గౌరవ వేతనంలో ప్రతి పైసా గ్రంథాలయాల అభివృద్ధికి, నిరుద్యోగుల సహకారానికి వినియోగిస్తా. నేను వ్యవసాయ కుటుంబంలో పుట్టి జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని అమెరికాలో లక్షల్లో జీతం వచ్చే జాబ్‌ను వదిలి పెట్టి ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చా. నిరుద్యోగుల తరపున పోరాడుతా.

– బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి



వర్ధన్నపేట సెగ్మెంట్ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, పక్కన హరీశ్‌రావు తదితరులు

### బస్సు తప్ప అన్నీ తుస్సే


**కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసింది**

**బోనస్‌పై బోగస్ మాటలు**

**ఉపాధ్యాయుల మూడు డీఏలు ఏవి?**

**కేంద్రాల్లో మొలకెత్తుతున్న వడ్లు**

# 6 గ్యారెంటీలకు నెలలైనా దిక్కేలేదు



- నిరుద్యోగ భృతిపై మల్లన్న గొంతు ఎందుకు మూగబోయింది?
- అసలైన మార్పు జరిగేలా ఓటర్లు తీర్పు ఇవ్వాలి
- ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ సెగ్మెంట్ల సన్నాహక సమావేశాలకు హాజరు

**అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలకు ఆరు నెలలైనా దిక్కేలేదు. అందులో బస్సు తప్ప అన్నీ తుస్సయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన గురువారం భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ సన్నాహక సమావేశాల్లో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కాంగ్రెస్ సర్కారు అన్ని వర్గాలను మోసం చేస్తోందని, దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వలేమని చేతులెత్తేసిందన్నారు. ఉపాధ్యాయుల మూడు డీఏలకు ఇప్పటికీ అతీగతీలేదన్నారు. ప్రభుత్వం రైతులను గోస పెడుతున్నదని, రాష్ట్రంలో వడ్లు కొనే పరి స్థితి లేదని, కొనుగోలు కేంద్రాల్లో నే వడ్లకు మొలకలు వస్తున్నాయని అన్నారు. అసలైన మార్పు జరిగేలా ఓటర్లు తీర్పు ఇవ్వాలని, ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని పిలుపునిచ్చారు.**

**- జయశంకర్ భూపాలపల్లి, మే 23 (నమస్తే తెలంగాణ)/కృష్ణకాలనీ/హనుమకొండ/తొర్రూరు/మరిపెడ**



భూపాలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, పక్కన హరీశ్‌రావు

అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు, 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని బాండ్ పేపర్లను చూపిస్తూ ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చి 180 రోజులు గడుస్తున్నా హామీల అమలును తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొందపెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాహుల్ గాంధీ వచ్చి ఆరు గ్యారెంటీలు అమలయ్యాయని అన్నడు.. అంటే ఆయనకు ఏ మాత్రం అవగాహన ఉందో అవగతమవుతుందని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్టాత్మకమని, మొదటి నుంచి ఈ సీటు మనమే గెలిచామని, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇచ్చి రెండు సార్లు గెలిపించారని, అదే మెజార్టీ రాకేశ్‌రెడ్డికి ఇచ్చి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలు దేవుడి పేరు చెప్పి ఒకరు, దేవుడిపై ఒట్లు పెట్టి మరొకరు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగారని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను, రూ.2లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని, ఈ దఫా ఎన్నికల్లో పోటీచేయనని చేసిన సవాల్‌ను ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి స్వీకరించ లేదని, ఆయన నైజాన్ని విద్యావంతులు గుర్తించాలన్నారు. సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ప్రకటించారని, తెలంగాణలో 99 శాతం దొడ్డు వడ్లు పండిస్తున్న రైతాంగానికి మొండిచేయి చూపారన్నారు. జైశ్రీరాం లాంటి సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.3వేల చొప్పున మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారని, ఇక కాంగ్రెస్ ఇచ్చే బోనస్ ఎవరికి వర్తిస్తుందన్నారు. ఒక టీవీ రిపోర్టర్‌గా అనాలసిస్ చేసే తీన్మార్ మల్లన్న గొంతు నిరుద్యోగులకు భృతి విషయంలో ఉందుకు మూగబోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు, నీళ్లు సక్రమంగా ఇవ్వలేదని, కనీసం పండించిన పంటనూ కొనుగోలు చేయడం లేదని, ఈ విషయమై పట్టభద్రులైన రైతులు నిలదీయాలన్నారు. ఎన్నికల సమయంలో రూ.2500 నిరుద్యోగ భృతి ఇస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగ భృతి మేం ఇస్తాం అని చెప్పలేదు.. అని నిండు సభలో అబద్ధమాడి నిరుద్యోగులను మోసం చేశారని, నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వలేమంటూ చేతులెత్తేశారని గుర్తు చేశారు. ప్రజలు కాంగ్రెస్ మోసాలను గమనిస్తున్నారని అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని, ఆరు నెలలైనప్పటికీ అంగుళం కూడా జరుగలేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీకి వాత పెట్టాలన్నారు. తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్‌ను బలపర్చాలని అన్నారు. కాకతీయ తోరణం వరంగల్ ప్రజల ఆత్మగౌరవం, ప్రతిష్ట అని, దాన్ని రాజ ముద్ర నుంచి తొలగించాలని సీఎం కుట్రలు చేస్తే వరంగల్ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.



చిన్నారితో హరీశ్‌రావు

**ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటించాలి..**

ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకపోతే బీఆర్ఎస్ వెంటాడుతుందని, నిరుద్యోగుల పక్షాన పోరాడుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 30వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ ఉద్యోగులకు నోటిఫికేషన్లు ఇచ్చింది, నియామక ప్రక్రియను పూర్తి చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమని, కేవలం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి ఉద్యోగాలు తామే ఇచ్చామని కాంగ్రెస్ చెప్పుకుంటున్న తీరును నిరుద్యోగ యువత గుర్తించాలన్నారు. అధికారంలోకి రాగానే 20వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటిస్తామన్న హామీ, నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. పరీక్షల ఫీజులు పెంచబోమని చెప్పి రూ.400 ఉన్న టెట్ ఫీజును రూ.2 వేలకు పెంచారని, చాయ్ తాగినంత టైంలో కస్తూర్బా టీచర్లను పర్మినెంట్ చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డికి ఇప్పటి వరకు తీరిక దొరకలేదా అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. త్వరలోనే కరెంట్, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు సన్నాహాలు చేస్తోందని, ప్రజల సంక్షేమానికి కోతలు పెట్టి ఆకాంక్షలకు వాతలు పెట్టాలని చూస్తున్న తీరు రేవంత్ రివర్స్ గేర్ పాలనకు అద్దం పడుతోందన్నారు. మన నీళ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ఆగడాలపై మౌనం వహిస్తున్న రేవంత్‌రెడ్డి తీరుపై పోరాడాలంటే కేవలం బీఆర్ఎస్‌కే సాధ్యమన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని కుట్రలు పన్నుతున్నారని, వీటిని అడ్డుకుని తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే రాకేశ్‌రెడ్డిని మండలికి పంపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలను ఆమోదించే వారు ఆ పార్టీకి ఓటు వేస్తారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రైవేట్ ఉద్యోగులు పక్షాన పోరాడే వారు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని హరీశ్ రావు పట్టభద్రులను కోరారు. కేసీఆర్ గిరిజనులకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లను రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. మనం మేల్కొని కొట్లాడకపోతే రిజర్వేషన్లు పోతాయి. ఈ రిజర్వేషన్ల వల్ల గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారు. గిరిజన మేధావులు మేల్కొనాలని హరీశ్‌రావు అన్నారు. డోర్నకల్ నియోజకవర్గం సస్యశ్యామలం చేసేందుకు పాలేరు, ఆకేరు, మున్నేరు వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సింగరేణిలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకోవాలని, ప్రతి పట్టభద్రుడైన కార్మికున్ని ఓటు అడగాలని, టీబీజీకేఎస్ వెంట తాముంటామని అన్నారు.

## కాంగ్రెస్ అసత్యాలపై మూగబోయిన మల్లన్న గొంతు

మీడియా పేరుతో, ప్రజల గొంతుకను అని చెప్పి సొంత ఆస్తులు సంపాదించుకోవడానికి అడ్డగోలు అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న గొంతు కాంగ్రెస్ సాగిస్తున్న అబద్ధపు ప్రచారాలపై నిలదీయకుండా మూగబోయింది. ఇలాంటి చీటర్‌ను చిత్తుగా ఓడించాలి. కాంగ్రెస్‌కు బ్లాక్ మెయిలర్, బీజేపీకి అసమర్థ అభ్యర్థులు ఉన్నారు. ఉన్నత విద్యను చదివి కొన్నేళ్లుగా ప్రజా సేవలో నిమగ్నమై ప్రజల గొంతుకగా పేరు తెచ్చుకున్న యువకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయించేలా పెద్దల సభలో వాణిని వినిపించి ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ వర్గాల పక్షాన పోరాడే సత్తా ఉన్న రాకేశ్‌రెడ్డిని ఆశీర్వదించాలి.

– మాజీ మంత్రి దయాకర్‌రావు



పాలకుర్తి సెగ్మెంట్ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, పక్కన హరీశ్‌రావు తదితరులు

## 'కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలి'

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రజల జీవితాలను చీకటిమయం చేసిన కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి, పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఆ పార్టీ నాయకులే ఓడించాలని చూస్తున్నారని అన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహా అందరు మంత్రులను బ్లాక్ మెయిల్ చేసిన నీచుడన్నారు. వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మాట్లాడుతూ అనేక సార్లు జైలు జీవితం అనుభవించిన ఖైదీ తీన్మార్ మల్లన్నను చట్టసభకు పంపితే పట్టభద్రులకు న్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, మెట్టు శ్రీనివాస్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, పసుమర్తి సీతారాములు, డాక్టర్ పీ సోమేశ్వర్‌రావు, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీలు శ్రీనివా స్, ఎన్నమనేని శ్రీనివాసరావు, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, నలమాస ప్రమోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, నేతలు గండ్ర గౌతంరెడ్డి, సాంబారి సమ్మారావు, బుర్ర రమేశ్, పాలిక రఘుపతి గౌడ్, బుర్ర రాజు గౌడ్, మహబూబాబాద్ జడ్పీ అధ్యక్షులు బిందు, వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, గుగులోత్ వెంకన్న, ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ తేజావత్ శారద పాల్గొన్నారు.



డోర్నకల్ సెగ్మెంట్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు



పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి హాజరైన పట్టభద్రులు, ప్రజలు


# మూడు రోజుల్లో ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- కమలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన
- తమ గోడు వెళ్లబోసుకున్న రైతులు

జయశంకర్ భూపాలపల్లి, మే 23(నమస్తే తెలంగాణ) : మూడు రోజుల్లో ధాన్యం మొత్తం లిఫ్ట్ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. గురువారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుతో రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 15 రోజులుగా సుమారు 20 లారీలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉందని, పొద్దంతా ఎండబోస్తున్నామని, రాత్రి వచ్చే వానకు తడుస్తుందని, తేమ శాతం 16, 17 ఉండాలని అధికారులు చెబుతున్నారని, రోజూ వర్షాలు పడి తడుస్తుంటే తేమ శాతం ఎలా తగ్గుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకో వడంలేదని, వర్షాలకు పక్కనే ఉన్న చెరువులోకి వడ్లు కొట్టుకుపోయేలా ఉన్నాయని, కనీసం కటింగ్‌తో తీసుకోమని కోరినా వినేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హరీశ్‌రావు జా యింట్ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. 'ప్రతి గింజా కొంటాం.. అని ప్రకటనలు ఇస్తున్నారు.. తడిసిన ధాన్యం కొంటామని అంటున్నారు.. కమలాపూర్‌లో పరిస్థితి ఏంటి.. 20 రోజులుగా వర్షాలకు ధాన్యం తడుస్తున్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదు' అని ప్రశ్నించారు. మూడు రోజుల్లో ధాన్యం మొత్తం లిఫ్ట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సన్నాలకు మాత్రమే బోనస్ అంటే వడ్లలో రాళ్లు ఏరేసినట్లు కాంగ్రెస్‌ను ఏరేసేవారని అన్నారు. సన్నాలతోపాటు దొడ్డు రకానికి బోనస్ ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. గుండె జబ్బుతో ఉండి 20 రోజులుగా కేంద్రం వద్ద ధాన్యాన్ని కాపాడుకుంటున్న మల్లికాంబ రైతు పరిస్థితి విని హృదయం ద్రవీభవించిందన్నారు.

**కంటతడిపెట్టిన మల్లికాంబ**

కమలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే హరీశ్‌రావు ముందు అక్కడే ఉన్న రైతు గాజె మల్లికాంబ కన్నీరు మున్నీరుగా విలపించింది. 'నేను మూడు ఎకరాల్లో దొడ్డు రకం వేశాను.. వరి కోసి 20 రోజులుగా ఐకేపీలోనే ఉంటున్నాయని, వడ్లు కొనేటోళ్లు లేరు' అని వాపోయింది. దయసేసి న్యాయం చేయండి సారూ అంటూ హరీశ్‌రావు చేతులు పట్టుకుంది. కలెక్టర్‌తో మాట్లాడుతా తప్పకుండా నీ వడ్లు కొనేలా చేస్తా అని చెప్పారు.




భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హరీశ్‌రావుతో తన ధాన్యం కొనుగోలు చేయాలని విలపిస్తున్న మహిళా రైతు మల్లికాంబ

## కేయూలో మెస్ మూసివేయొద్దని ఆందోళన

### రిజిస్ట్రార్ దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ చౌరస్తా, మే 23 : కేయూలో మెస్‌లను మూసివేస్తామని హాస్టల్ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట వంట సామగ్రితో ఆందోళనకు దిగారు. రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడుతూ..గ్రూప్స్, డీఎస్సీ, వివిధ రకాల కాంపిటీటివ్ పరీక్షలు త్వరలో జరుగనున్నాయని, ఈ సమయంలో మెస్‌లను మూసివేయడం తగదన్నారు. ఈ క్రమంలో హాస్టళ్ల డైరెక్టర్ సమ్మయ్య అక్కడికి వచ్చి యథావిధిగా మెస్‌లను నడిపిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసన విరమించారు. విద్యార్థి నాయకులు వినయ్, రాజు, శ్రవణ్, అర్జున్ పాల్గొన్నారు.



కేయూ పరిపాలనా భవనం ఎదుట వంట సామగ్రి, ప్లేట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు